# ఉభయమారకం

ప్రొద్దున్నే బద్ధకంగా బాత్‌రూం తలుపు బోల్ట్ తీస్తున్నాడు. బుచ్చిబాబు. తీస్తుండగానే, అతని చేతి క్రింద నుంచి గబుక్కున లోపలికి దూరి, దబుక్కున తలుపు మూసి, చటుక్కున లోపలి బోల్ట్ వేసేసింది విమల!

"ఏయ్! ఏయ్! ఏమిటది? నేనర్జంటుగా వెళ్ళాలి" అరిచాడు బుచ్చి.

"నేనంతకన్నా అర్జంటుగా బ్యాంకు కెళ్ళాలి" తిరిగరిచింది విమ్మి

"ఛ! ఛ!" అనుకుంటున్న బుచ్చిబాబుకి - బాత్రూం లోంచి గాజులు, మంగళసూత్రాల గలగలలతో కలగలిసిపోయిన స్నానాల గది చప్పుళ్ళు అంత అర్జంటులోనూ మన్మథ గర్జనల్లా వినబడ్డాయి.

"అదేదో యిద్దరం కలిసి ఏడిస్తే, ఒకేసారి రెండు పన్లూ అయిపోయేవి కదా!" అన్నాడు.

"నా బుచ్చే! తమరితో లోపలికొస్తే అయిపోయేది పన్లు కాదు, నా బ్యాంకు." రుద్దుతున్న సోపుకన్నా ముద్దుగా సోకుపోయింది విమల గొంతు.

"అంతే! అంతే! మొగుడు పోయినా సరే, బ్యాంకు పోకుండా వుంటే చాలు!"

"ఏమిటా వెధవ మాటలు!" పంపుకన్నా ఫోర్సుగా వుంది విమల గొంతు.

"నీ బ్యాంకు దయవల్ల, ఈ వెధవకి మాటలేగా మిగిలింది చివరికి!" బుచ్చి గొంతు బాత్ రూం క్లీనర్‌లాగా పొగలు కక్కుతోంది.

లోపల నీళ్ళ చప్పుడాగిపోయింది. "బాత్రూం బయటే వేళ్ళాడుతూ అలా వాగుతూ నా ప్రాణం తీసే బదులు, కాస్త మాడే కూర దింపవచ్చు గదా?" తీక్షణంగా అంది విమల.

"బయటేం కర్మ! లోపలా వేళ్ళాట్టమే నా పని! కూర ఏం కర్మ!! నేనే మాడిపోతాను ఎప్పుడో! అప్పుడు నీ ప్రాణం సుఖంగా వుండచ్చు" కూర గిన్నె డామ్మని చప్పుడు.

కళ్ళనీళ్ళు తిరుగుతూ బాధగా బయటికొచ్చింది విమల.

టర్కీ టవల్ భుజాన వేసుకుని విసురుగా లోపలికెళ్ళాడు బుచ్చిబాబు!

యాంత్రికంగా డ్రెస్సుయిపోయి, పిల్లల్ని రెడీ చేసి, క్యారియర్‌లు సర్దేసి, బయటికి కదుల్తూ, "గ్యాసు పొయ్యి గట్టుమీద వంట రెడీగా వుంది. పిల్లల్ని దించి నే బ్యాంకుకి వెళ్తున్నా. సాయంత్రం తీసుకొస్తారుగా" అని కేకేసింది విమల.

"తీసుకొస్తాన్లే ..... రోజూ వింటున్నదేగా వెధవ రికార్డు! అరిగిపోయిన రికార్డు" ఒళ్ళు తుడుచుకుంటూ బయటకొస్తున్న బుచ్చిబాబు విదిలించాడు. "ఇల్లాగే రిటైరయ్యేదాకా, బ్యాంకులో రికార్డులూ, ఇంట్లో రికార్డులూ అరగదియ్యి. నేనెప్పుడో బాల్చీ తన్నేస్తాను. కూడబెట్టిన లక్షల్తో అప్పుడెంజాయ్ చెయ్యొచ్చు. ఒక్కత్తివీ హాయిగా హనీమూన్ లయ్యిపు!

ఆ మాటలు వింటూ కదిలిపోయింది విమల!

★ ★ ★

విమల బ్యాంకీ ఉద్యోగి!

బుచ్చిబాబు ఘోర్నమెంట్ ఆఫీసరు!


పనిమనిషి, పాలమనిసి, కూరల మనిషి, కాఫీలు, వంట, పిల్లల స్కూలు, వీటిల్తో తెములుచ్చుకుని ప్రొద్దున్నే బ్యాంకుకి తయారయి వెళ్ళిపోవాలి విమల.

ఎనిమిదింటికే ఇల్లాలు ఆఫీసుకెళ్ళిపోతే, పదింటిదాకా ఏడుపు మొహం ఈడ్చుకుంటూ ఫ్లాస్కోలో కాఫీ తాగి, వడ్డించుకున్న అన్నం తిని, అంట గిన్నెలు అవతలికి నెట్టి, తలుపులు తాళం వేసి బయల్దేరాలి బుచ్చిబాబు.

మధ్యాహ్నం ఇంటికొచ్చి, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, నాలుగు నిమిషాలు రెస్టు, తీసుకుని, మళ్ళీ ఈవెనింగ్ కౌంటర్‌కి రెడీ అయిపోతుంది విమల!

సాయంత్రం స్కూలుకెళ్ళి పిల్లల్ని తీసుకొచ్చి, ఏడున్నరకి ఆవిడగారొచ్చేదాకా ఎటు పోవడానికీ లేక, చేతనైనంత వంట చేసి ఎదురు చూస్తూ కూర్చుంటాడు బుచ్చిబాబు.

రాంగానే ఆయనగారి వంట రిపేరు చేస్తూ కొంతసేపు పిల్లలకి హోం వర్కు చేయించి కొంతసేపు ఓవర్ టైము చేస్తుంది విమల. చివరికి పడుకునే సమయానికి అలిసిపోయి నిద్రో! మాడు పట్టునుంచి – మడమ దాకా ఎక్కడో అక్కడ నొప్పో! గుడ్‌నైట్!!!



మిషన్ అయిపోయిన వైఫ్‌తో, లైఫ్‌లో కుషన్ పోయింది బుచ్చిబాబుకి. రొటీన్ లైఫ్‌తో సెటప్ అయిపోయింది విమల! 'సెటప్' చేద్దామనుకున్న ఎన్నో నైట్సు "షటప్స్" ఎదురై "అప్‌సెట్" అయిపోయాడు బుచ్చిబాబు.

"అటు ఆఫీసులో, యిటు ఇంట్లో రెండు వైపులా నలిగిపోతున్నావు. నువ సుఖపడలేని, నన్ను సుఖ పెట్టలేని ఈ ఉద్యోగం ఎందుకు? మానెయ్యరాదూ?" అన్నాడు నాల్రోజుల క్రితం నిద్రపట్టని ఓ నైటు.

"అదేదో మీరే చేసి, నన్ను సుఖపెట్టొచ్చుగా" అని అటు తిరిగి పడుకుంది విమ్మి.

అంతే! ఆ రోజు నుంచీ పెంపుడు పూడ్‌ల్ లాగా వుండే బుచ్చిబాబు, ప్యూడల్ బ్యానర్‌లాగా తయారవుతున్నాడు. రోజురోజుకీ రఫ్‌గా తయారవుతున్న బుచ్చిని చూసి, ఎన్నడూ లేని భయం పట్టుకుంది విమలకి.

సుఖం కోరిన బుచ్చి మనసు అడ్డం తిరిగితే? మనసిచ్చిన మగవాడు తనవాడు కానినాడు, ఎంత ఉద్యోగం వుండి ఏం ప్రయోజనం? తన మనసు గతి, తన పిల్లల గతి ఏమిటి? ఆలోచించింది విమల!

★ ★ ★

సాయంత్రం స్కూలు కెళ్ళిన బుచ్చిబాబుకి, "అమ్మగారొచ్చి పిల్లల్ని తీసికెళ్ళారండి" అంది ఆయా!

ఇంటికెళ్ళిన బుచ్చిబాబుకి మల్లెమొగ్గల మధ్య ముద్దమందారమల్లే దర్శనమిచ్చింది విమల!

ఆశ్చర్యపోతున్న బుచ్చికి కాఫీ యిచ్చి "మై డియర్ బుచ్చీ మీకో గుడ్ న్యూస్! నేను జాబ్ రిజైన్ చేసేశాను" అంది విమల.

"ఆ!" అని కూలబడిపోయాడు బుచ్చిబాబు. ఓ అరగంట షోడశోప చారాల తర్వాత, స్లోగా లేచిన బుచ్చిబాబుతో "ఏమైందండి! ఏమైంది?" అని అడిగింది విమల.

"నిజంగా జాబ్ రిజైన్ చేశావా?" సందేహంగా అడిగాడు బుచ్చి.

"నిజంగానే చేశాను. మిమ్మల్ని సుఖపెట్టలేని ఆ జాబ్ ఎందుకు నాకు? అంచేతే రిజైన్ చేసేశాను" ఆవేశంగా చెప్పింది విమ్మీ.

"ఖర్మ! ఖర్మ!" అన్నాడు బుచ్చి.

"ఏమిటోయ్ ఖర్మ?" అని మీద పడింది విమల

"నీ సుఖం కోరే నేనూ జాబ్ రిజైన్ చేశాను."

"ఆ!" అని కూలబడిపోయిన విమలతో యింకా చెప్తూనే వున్నాడు బుచ్చిబాబు. "ఆత్మాభిమానం కల నువ్వు, నాకన్నా ముందొచ్చిన ఆ జాబ్‌ని వదలలేవని నిశ్చయం చేసుకుని, నిన్ను వదలలేని నేను జాబ్‌ని వదిలేశాను......

కారుమబ్బుల మధ్య ఉదయించిన సూర్యుణ్ణి కానలేక, వికసించలేని తామర పువ్వు-

చంద్రోదయం లేక ముకుళించుకుపోయిన కలువ పువ్వూ -

రెండూ ఒక్కలాగే కనిపించి, తామరాకు మీద నీటి చుక్కలు రెండు ఫక్కుమన్నాయి.